

ఆచంట మండలంలో వర్షం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం ఒక్క సారిగా మేఘావృతమై అక్కడక్కడా చెదురుముదురు వర్షాలు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లబడింది. మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, వల్లూరు, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు తదితర గ్రామాల్లో ఒక మోస్తారు వర్షం పడింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతాంగంలో అలజడి నెలకొంది. దీంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.



ఆచంటలో కురుస్తున్న వర్షం

ముందస్తు సాగు సాగేనా..!

ఖరీఫ్‌లో ముందస్తు సాగుపై ప్రతియేటా ప్రకటనలు గుప్పించడం.. షరా మాములు అన్నట్లుగా నారుమడులు ఆలస్యంగా వేయడం, దీంతో ప్రతియేటా రబీసాగుపై తీవ్ర ప్రభావం చూపడం పరిపాటిగా మారిపోయింది. ఈసారి ముందస్తు సాగుకు పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రైతులకు అవగాహన కల్పించి అధికారులు ప్రణాళికలు అమలు చేస్తారా అనే చర్చ నడుస్తోంది.



- జూన్ 1న కాలువలకు నీరు విడుదలకు సిద్ధం
- నైరుతి రుతుపవనాలు ముందుగానే రానున్నట్లు వాతావరణశాఖ వెల్లడి
- ఖరీఫ్ సాగుపై ముందస్తు ప్రణాళికలు జరిగేనా
- రెండు జిల్లాల్లోనూ దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరిసాగు
- ఖరీప్ సాగు ఆలస్యంతో ప్రతియేటా రబీపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టనున్నారు. జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. నైరుతి రుతుపవనాలుసైతం జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో ఈ నెల 24వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈసారి ముందస్తు సాగుకు వాతావరణం అనుకూలంగా ఉన్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. ప్రతియేటా జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేస్తున్నప్పటికీ నారుమడులు మాత్రం సకాలంలో పడటం లేదు. జులై మొదటి వారం వరకూ నారుమడులు వేయని పరిస్థితి ఉంటుంది. ఎండలు ఎక్కువగా ఉండటం వంటి కారణాలతో రైతులు ముందుకు రావడం లేదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రైతులకు ఇప్పటి నుంచే ముందస్తు సాగుపై అవగాహన కల్పిస్తే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంది. అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి. ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో ప్రతియేటా రబీలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగునీటి సమస్యతోపాటు అకాల వర్షాల బారిన పడి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది సైతం మే రెండో వారంలోనూ రబీ మాసూళ్లు సాగాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. గతేడాది మాత్రం రబీలో కురిసిన వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా ఖరీఫ్‌లో గాలులకు నేలకొరగని విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్‌లో అత్యధికంగా సంపత్ స్వర్ణ విత్తనాన్ని రైతులు వినియోగిస్తున్నారు. ఇంకా మెరుగైన విత్తనాలు ఉంటే రైతులకు అధికారులు సూచిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులకు కిలోకు రూ.ఐదు సబ్సిడీతో విత్తనాలు, ఖరీఫ్‌కు కావాల్సిన ఎరువులన్నీ సిద్ధం చేసినట్లు లెక్కలు వివరిస్తున్నారు. జూన్ రెండో వారంలోనే నారుమడులు వేసేలా రైతులకు అవగాహన కల్పిస్తేనే ఖరీఫ్ సాగు గాడినపడే అవకాశం ఉంటుంది. అలాకాకుండా జూన్ నెలాఖరు వరకూ నారుమడులు వేయకపోతే పరిస్థితి ప్రతియేటా మాదిరిగానే తయారవుతుంది. వాతావరణం అనుకూలంగా ఉన్న ఈ పరిస్థితుల్లో అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తే ముందస్తు సాగు ఇబ్బందులు ఫలించే అవకాశం ఉంటుంది. అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

ఓఎన్‌జిసి పైపులైన్లు వెళ్లే గ్రామాలకు..

న్యాయం చేస్తాం

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఓఎన్‌జిసి పైపులైన్లు వెళ్లే గ్రామాలకు సాధ్యమైనంత మేర న్యాయం చేస్తామని, ఆయా గ్రామాల రైతులు అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో సీతారామపురం సౌత్, యర్రంశెట్టివారిపాలెం, రుస్తుంబాద గ్రామాల రైతులతో, ఓఎన్‌జిసి అధికారులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశమై చర్చించారు. ఆయా గ్రామాల ప్రజలకు సాధ్యమైనంత మేర న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అందరూ అభివృద్ధికి సహకరించాలని, అవగాహన లేకుండా ప్రాజెక్టును అడ్డుకోవడం సరికాదని కలెక్టర్ హితువు పలికారు. పైపులైన్లు వెళ్తున్న మార్గంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను సర్వే చేయించి వాస్తవ హక్కుదారులను గుర్తించి ఎంతమేర న్యాయం చేయగలుగుతామో ఓఎన్‌జిసి అధికారులతో సమీక్షిస్తామన్నారు. మూడున్నర మీటర్ల వెడల్పు మార్గంలోనే సుమారు 3.20 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయడం జరుగుతుందన్నారు. పైప్ లైన్ వెళ్లే మార్గం ప్రభుత్వ భూమిగా గుర్తించామని తెలిపారు. ఓఎన్‌జిసి పైప్‌లైన్లు వెళ్లే మూడు గ్రామాలకూ ఒక్కో గ్రామానికి 15 లక్షల రూపాయలు చొప్పున రూ.45 లక్షలు గ్రామాలాభివృద్ధికి నిధులను ఓఎన్‌జిసి ద్వారా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పైపులైన్లను ప్రాజెక్టు పూర్తయిన వెంటనే తొలగించేలా ఓఎన్‌జిసి అధికారులకు సూచించామన్నారు. పైపులైన్లు వెళ్లే మార్గంలో భూముల క్రయ విక్రయాలకు ఏ విధమైన ఇబ్బందిలేకుండా చూస్తామన్నారు. సమావేశంలో పలువురు గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానమిచ్చారు. అనంతరం కలెక్టర్ ప్రతిపాదనలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ, పైప్‌లైన్లు వేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెసి సివి.ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కరరావు, ఓఎన్‌జిసి అధికారులు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కొండ్రుప్రోలును గూడెంలో కలపొద్దు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

కొండ్రుప్రోలు గ్రామాన్ని తాడేపల్లిగూడెం పట్టణంలో కలపొద్దని, తమ ఉపాధిని దెబ్బతీయొద్దని ఆ ప్రాంతం ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కొండ్రుప్రోలు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు కూలీల సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. నాలుగేళ్ల నుంచి గ్రామాన్ని మున్సిపాల్టీలో విలీనం చేయడం ద్వారా కూలీలకు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదే వారికి పనులు కల్పించడంతో కొంత ఆసరా వచ్చిందన్నారు. పట్టణాల్లో విలీనం చేసిన గ్రామాల్లో కూడా పూర్తిస్థాయి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుడిగిన లక్ష్మి, దిరిస్వాముల సుబ్బారావు, మర్లపూడి వీరాస్వామి, మాందాల తులసమ్మ, నెలపాల అంజయ్య, మార్లపూడి రామారావు, ఉప్పలపాటి సత్తియ్య, కొమ్ము చంటి పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

24 నుంచి జూన్ 1 వరకూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కమిటీ సభ్యులు, విద్య, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, ఎపిఎస్ ఆర్‌టిసి, పోస్టల్ తదితర శాఖల అధికారులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఇంటర్ ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిలో మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించి మొత్తం 10,946 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్ కింద 8,793 మంది, ఒకేషనల్ కింద 384 మంది, మొత్తం 9,177 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఆలాగే రెండో సంవత్సరం జనరల్ కింద 1547 మంది, ఒకేషనల్ కింద 222 మంది మొత్తం 1769 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఏడో తేదీన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలను ఇంటర్ విద్యార్థులు తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పెన్నులు, హాల్ టికెటు, గుర్తింపు ఐడి కార్డుతో పరీక్షకు గంట ముందు హాజరు కావాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో శానిటేషన్ పక్కగా ఉండాలన్నారు. పరీక్షల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా లికెజిఆర్ ఎల్ కాలేజీలో కమాండ్ కంట్రోల్ రూమ్ పి.జయరామ్ నంబరు 9059583683 ఏర్పాటు చేశామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కరరావు, ఇంటర్మీడియట్ ఆర్‌ఐఒ, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎ.నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ప్రవీణ్ ఆదిత్య

పది సప్లిమెంటరీ పరీక్షలు..

పకడ్బందీగా నిర్వహించాలి

డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కర్‌రావు

ప్రజాశక్తి - భీమవరంటౌన్

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం డిఆర్‌ఒ ఛాంబర్ వద్ద పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకూ జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో భీమవరం, ఆకివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, పెనుగొండ, పాలకొల్లు, నర్సాపురం, అత్తిలి తదితర 41 కేంద్రాల్లో 8,953 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి 1,590 మందికి భీమవరం, నరసాపురంలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలూ కల్పించాలన్నారు. విద్యార్థులు అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష సమయానికి అనువుగా ఆర్టీసీ బస్సులను నడపాలని డిఆర్‌ఓ జె .ఉదయ భాస్కర్ రావు ఆర్టీసీ అధికారులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, పదవ తరగతి పరీక్షలు నిర్వహణ ఇంచార్జ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్. సత్యనారాయణ, జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి .అహ్మద్ ఖాన్, ఆర్టీసీ అధికారి శ్రీమతి సి.గీతావాణి, పోస్టల్ డిపార్ట్మెంట్ ఎల్ పరశురాం, వైద్యశాఖ అధికారి ఏ జె సందాని, తదితరులు పాల్గొన్నారు.



కోడి కొండెక్కింది..!

అమాంతం పెరిగిన చికెన్ ధరలు

ఓరి నాయనో.. ఇంత ధరా అంటున్న జనం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్కెట్‌లో బ్రాయిలర్ చికెన్ ధరలు అమాంతం పెరిగాయి. దీంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ తినాలంటే జేబు కాస్త ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వారు వాపోతున్నారు. గత కొద్దిరోజులుగా కొండెక్కి కూర్చున్న చికెన్ ధరలు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎపితోపాటు, తెలంగాణలో కూడా చికెన్ ధరలు భారీగా పెరిగాయని తెలుస్తోంది.




గత వారం వరకూ కిలో చికెన్ ధర రూ.250 నుంచి రూ.280 మధ్య ఉండగా, ప్రస్తుతం మరింత పెరిగి కిలో ఏకంగా 300 రూపాయలు పలుకుతుంది. మరో 15 రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. మండుతున్న ఎండలు, వాతావరణంలో మార్పుల కారణంగా కోళ్ల ఉత్పత్తి బాగా తగ్గి పోయిందని, జూన్ వరకూ ఇదే పరిస్థితి ఉంటుందని హోల్ సేల్ కోళ్ల వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గత వారం 30 గుడ్ల ట్రే 150 రూపాయలు ఉండగా, ప్రస్తుతం రూ.180 దాటి పలుకుతోంది. దీనివల్ల వినియోగదారులతో పాటు చిల్లర వ్యాపారులు సైతం నష్టపోతున్నారని వారు అంటున్నారు. ఏదిఏమైనా చికెన్ ప్రియులు ధర చూసి బెంబేలెత్తిపోతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఫ్యాప్టో నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఫ్యాప్టో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల విధుల్లో భాగంగా ఉపాధ్యాయులు ఎదుర్కొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి ఆ సంఘం నేతలు సోమవారం తీసుకెళ్లారు. ప్రధానంగా జిల్లా అంతటా ఒకే విధంగా ఐదు రోజులు ఎన్నిలక విధులకు సంబంధించి సర్టిఫికెట్ ఇవ్వాలని, ఐదు రోజులకు రెమ్యునరేషన్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి ఆర్‌ఒలకు, పిఒ, ఎపిఒలకు 5 రోజులు, ఒపిఒలకు 3 రోజులు ఇవ్వాలని మెసేజ్ పెట్టారు. అనంతరం జిల్లాలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్ ఉపాధ్యాయులను అభినందించారు. ఫ్యాప్టో తరపున కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పి.సాయివర్మ, కో ఛైర్మన్ జి.ప్రకాశం, డిప్యూటీ సెక్రటరీ పిఎస్.విజయరామరాజు, పివి.రమణ, విజయకుమార్, వి.జానకి రామరాజు, జి.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో సంఘం నాయకులు

విభిన్న పరిశోధనలతోనే దేశాభివృద్ధి

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విభిన్న పరిశోధనలు దేశ అభ్యున్నతికి వెన్నెముకగా నిలుస్తాయని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. బయోటెక్నాలజీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ ఆధీనంలోని సెర్బ్ సహకారంతో ప్రాసెస్ మోడలింగ్ సిమ్యులేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ఇన్ బయోలాజికల్ సిస్టమ్స్, ఎ హాండ్స్ ఆన్ ట్రెయినింగ్ అప్రోచ్ అనే అంశంపై ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహించనున్న కార్యశాల హై ఎండ్ వర్క్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. పరిశోధక విద్యార్థులు సంస్థ కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని, వినూత్న అలోచనలతో ముందుకు సాగాలని వివరించారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి మాట్లాడారు. బయోటెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిన రంగమని తెలిపారు. ఔషధాలు, బయో ఇంధనాలు, ఇతర బయోటెక్నాలజీ ఉత్పత్తుల నాణ్యత, దిగుబడులను పెంచేందుకు ఇటువంటి వర్క్ షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (చెన్నయ్) ఎన్విరాన్మెంటల్ సైన్స్ ల్యాబ్ హెడ్ అండ్ చీఫ్ సైంటిస్ట్ షణ్ముగం మాట్లాడారు. తోళ్ల పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల వాటర్‌తో బయోగ్యాస్ ఎలా తయారు చేయాలి, బయోగ్యాస్ ఉత్పత్తికి ఎలాంటి బయో రియాక్టర్లను వాడాలి, వాటిని ఎలా డిజైన్ చేయాలి, బయో గ్యాస్ ప్రాధాన్యత వంటి అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బయో టెక్నాలజీ ఇంజినీరింగ్ విభాగాధిపతి సుదర్శన్ దీప, కార్యక్రమ ఆర్గనైజర్ రాజేశ్వరరెడ్డి, ఆచార్యులు జగన్మోహన్‌రావు, శీనివాసన్, బాబూరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి



తేనెటీగల పెంపకం గురించి మాట్లాడుతున్న మల్లికార్జునరావు

పురుగుమందులతో తేనెటీగలు కనుమరుగు

డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు

ప్రజాశక్తి - ఉండి

పురుగుమందుల వాడకంతో తేనె టీగలు కనుమరుగవుతున్నాయని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ప్రపంచ తేనెటీగల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతులకు తేనె టీగల పెంపకం గురించి తేనె ఉత్పత్తి ఉపయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ పంటల దిగుబడి పెంపకంలో తేనెటీగల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. పురుగుమందుల వాడకం వల్ల తేనెటీగలు నశించిపోతున్నాయన్నారు. పంటల దిగుబడి పెంచడానికి తేనెటీగలను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి రైతు పైనా ఉందని తెలిపారు. కల్తీ తేనె పరిశీలన, స్వచ్ఛమైన తేనె ఉత్పత్తి ఉపయోగాలు వంటి అంశాలపై రైతులకు వివరించారు. ఏటా మే 20న ఆటోన్ జాన్స్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచ తేనెటీగల దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.డెబోరా మెస్సియానా, ఎ.శ్రీనివాసరావు, పి.వినయలక్ష్మి, బి.రజిత, తేనెటీగ ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

పలు చోట్ల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల ఆదేశానుసారం తాడేపల్లిగూడెం డిఎస్‌పి డిఎస్ ఆర్‌విఎస్ఎన్.మూర్తి ఆధ్వర్యంలో రెండోరోజు సోమవారం ఉదయం ఐదు గంటలకు పట్టణంలోని వర్ఫ్ రోడ్డులో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిం చారు. ఈ కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్ఐ కె.సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పెనుమంట్ర : జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు మండలంలోని పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో సోమవారం పోలీస్ కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు పెనుగొండ సిఐ రజనీకుమార్ తెలిపారు. దస్త్రాలు లేని వాహనాలను పట్టుకోవడం, అనుమానితులను ప్రశ్నించడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు పోలీసులకు సహకరించి, శాంతి యుతంగా మెలగాలని కోరారు. ఈ ఆపరేషన్‌లో సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు సుభాని, రవీంద్ర బాబు, రాజ్ కుమార్, 20 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారని సిఐ తెలిపారు.



తాడేపల్లిగూడెం: కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


సముద్రంలో నీటమునిగిన.. యువకునికి తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి - నరసాపురం, మొగల్తూరు

స్నేహితులతో కలిసి సముద్రస్నానానికి దిగిన యువకుడు అలలు ధాటికి గల్లంతై తిరిగి అదే సమయంలో అలలకు తీరానికి కొట్టుకొచ్చాడు. అతనిని వెంటనే స్నేహితులు ప్రభుత్వాసుపత్రికి తరలించిన సంఘటన పేరుపాలెంబీచ్ వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన దొంగ గౌతమ్ స్నేహితులతో కలిసి కేటరింగ్ చేయడానికి వెళ్లారు. అక్కడ పని పూర్తికావడంతో సరదాగా గడిపేందుకు పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. సముద్రస్నానానికి స్నేహితులతో కలిసి దిగాడు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తూ గౌతమ్ కొట్టుకుపోయాడు. ఏంచేయాలో తెలియక మిత్రులు కంగారు పడ్డారు. అదే సమయానికి తిరిగి అలలకు తీరానికి కొట్టుకొచ్చాడు. గౌతమ్‌ను స్నేహితులు స్థానికుల సహకారంతో 108 వాహనంలో నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గౌతమ్‌ను మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.



గౌతమ్‌ను అంబులెన్స్ నుంచి దింపుతున్న సిబ్బంది


కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మానవత సభ్యులు

మానవత వేసవి శిబిరం ముగింపునకు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెనుమంట్ర శాఖ ఆధ్వర్యంలో మార్టేరులో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ని ఆహ్వానించారు. సోమవారం ఈమేరకు భీమవరం వెళ్లిన మానవత కమిటీ సభ్యులు వారిని చాంబర్ లో కలిసి, ఈ నెలాఖరున జరిగే మానవత రాష్ట్ర స్థాయి శిబిరం ముగింపు సమావేశానికి ఆహ్వానించడం జరిగింది. తనకు యువతకు, బాలలకు స్ఫూర్తి కలిగించే ఇలాంటి కార్యక్రమాలు అంటే బాగా ఇష్టమని, తప్పక హాజరు అవుతానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో మానవత అధ్యక్షులు బాబాజీ శ్రీనివాసరావు, కార్యదర్శి బండి ప్రసాద్, కోశాధికారి శ్రీనివాసుల మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి, ఇసి మెంబర్ చిర్ల వంశీ రెడ్డి పాల్గొన్నారు.

పాలమూరులో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం మారిన వాతావరణం దృష్ట్యా ఆరోగ్య పరిరక్షణ విషయంలో అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెనుమంట్ర పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ కె.లావణ్య తెలిపారు. సోమవారం మండలంలోని పాలమూరు గ్రామంలో ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేశారు. పిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అన్ని గృహాలను సందర్శించి, ఆరోగ్య సర్వే చేశారని అన్నారు. ప్రస్తుతం రెండు వైరల్ ఫీవర్ కేసులు గుర్తించి వారికి తగిన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పాలమూరు గ్రామంలో రక్షిత మంచినీటిని శుద్ధి చేయించడానికి వీధుల్లో క్లోరినేషన్ చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న అంజిబాబు

ప్రజాదరణను మరువలేను..

మాజీ ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం నియోజకవర్గంలోని కూటమి విజయం తథ్యమని, ప్రజలు చూపించిన ఆదరణే తమ విజయమని మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం భీమవరం 37వ వార్డులోని మహిళలతో ఆయన ముచ్చటించారు. మీ ఆదరణ ఎప్పటికీ మరువలేనిది, ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటానని, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కృషి చేశారని, కూటమి విజయం సాధించిందని అన్నారు. కూటమి విజయం సాధించిన వెంటనే ప్రతి వార్డుని అభివృద్ధి చేస్తానని తెలిపారు. జనసేన జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్, మాజీ కౌన్సిలర్ చెన్ను శాంతి చంటి, చెన్ను శ్రీను, పట్టణ మెగా ఫ్యాన్స్ అధ్యక్షులు వల్ల రాము, చరణ్, విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఉండి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలవడంతో కేసు నమోదైన సంఘటన ఉండి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఉండి గ్రామానికి చెందిన కెంగం ప్రవీణ్ గణపవరం వైపు వెళ్తుండగా వెలివర్రు వైపు నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొనడంతో ప్రవీణ్‌కు గాయాలవ్వడంతో భీమవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

వ్యక్తిని బెదిరించి, దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి-గణపవరం రహదారిలోని బ్రాందీ షాప్ సమీపంలో ఉండి గ్రామానికి చెందిన చేవూరి రాజశేఖర్ అనే వ్యక్తి చేపలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఉండి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఈనెల 16వ తేదీన రాజశేఖర్ వద్దకు వచ్చి చేపలు మొత్తం ఎంతకిస్తావని అడిగారు. ఆయన రూ.400కు ఇస్తానని వారితో చెప్పగా ముగ్గురు వ్యక్తులు బేరం లేదు సంచిలో వేసి ఇవ్వాలని రాజశేఖర్‌ను బెదిరించి, రాజశేఖర్‌పై దాడి చేశారు. ఈమేరకు సోమవారం రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలను, ప్రయాణికులను కొట్టిన వ్యక్తి అరెస్టు

డిఎస్‌పి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

పేరుపాలెం బీచ్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా కారుకు సైడ్ ఇవ్వలేదని ఆటోలో ప్రయాణికులు, మహిళలను కొట్టిన వ్యక్తిని అరెస్ట్ చేశామని నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సాయంత్రం డిఎస్‌పి కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి జి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌కి వెళ్లి తిరిగి వస్తున్న ఆటోపై, కెపి పాలెం గ్రామంలో మహిళలపై జరిగిన దాడి ఘటనలో దాడికి పాల్పడిన బళ్ల వీర వెంకట సత్యనారాయణ(బాబి) అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. నరసాపురం మండలం లక్ష్మేణేశ్వరం గ్రామానికి చెందిన కడలి సత్య దుర్గ తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆటోలో బీచ్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా కెపిపాలెం నార్త్ కృష్ణుడు గుడి సమీపంలో తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన బళ్ల బాబి, ఆయన అనుచరులు కారుకి ఆటోమార్గం ఇవ్వలేదనే కారణంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురుని తీవ్రంగా కొట్టారు. చేతులు, సీసాలతో మహిళను, ఆటోలో ప్రయాణిస్తున్న అందరినీ బళ్ల బాబితో పాటు మరో నలుగురు లక్కు అంజి బాబు, చామకూరి నాని, కడకట్ల శివ, గోడి భాస్కర్ నారాయణలు దాడికి పాల్పడ్డారని అన్నారు. దాడికి పాల్పడిన బళ్ల బాబి, మరో నలుగురుపై మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 154 కింద సెక్షన్ 341, 323, 324, 354, 509 రెడ్ విత్ 34 కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుల దాడికి వాడిన కారు సీజ్ చేసామని, దాడికి పాల్పడిన బళ్ల బాబిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని, దాడికి పాల్పడిన మరో నలుగురు పరారైనట్లు, వారి కోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు త్వరలోనే మిగిలిన నలుగురు నిందితులను అరెస్ట్ చేస్తామని తెలిపారు. గతంలో పలు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల ఆధారంగా అతని ప్రవర్తన రీత్యా రౌడీషీట్ తెరిచేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. బాధితుల భార్య కడలి సత్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మూడు కేసులు ఉన్నప్పటికీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ కేసు ఎందుకు నమోదు చేయలేదని విలేకరి ప్రశ్నించగా కౌంటర్ కేసులపైనే బైండోవర్ కేసు కట్టామని, కేసు నమోదు చేసామని శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు ఎస్ఐ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

దాడి ఘటనలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రి తణుకు తరలించారు. బళ్ల బాబి, ఆయన అనుచరులు దాడిలో తీవ్రంగా గాయపడిన కడలి మధు, బొక్కా లక్ష్మిలను సోమవారం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రి తణుకు 108 అంబులెన్స్‌లో తరలించారు. ఎన్నికల వేల శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించకూడదని పోలీసులు తెలిపారు.

సమస్యల వలయంలో పెనుమంట్ర

సాగునీరుకు లాకుల అడ్డంకులు
రక్షిత మంచినీటికి కటకట
సజావుగా పారని గోస్తనీ మురుగు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట అసెంబ్లీ నియోజకవర్గంలోని పెనుమంట్ర మండలంలో పద్దెనిమిది గ్రామాల్లో పలు సమస్యలు చిరకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. పెనుమంట్ర మండలానికి గుండెకాయగా చెప్పుకొనే నెగ్గిపూడిలోని వ్యవసాయ పరిశోధనా స్థానం వంద సంవత్సరాల మైలు రాయిని చేరుకుంటూ ఉండడం విశేషం. ఇక్కడ రూపొందిన సుమారు 70 రకాలకు చెందిన వరి వంగడాలు(విత్తనాలు) దేశంలోనే గొప్ప పేరు తెచ్చుకున్నాయి. అయినప్పటికీ పలు గ్రామాలు సమస్యల వలయంలో పేరుకుపోయాయి.


శిథిలమైన ఎస్‌ఐ పర్రు లాకులు

శిథిలమైన సోమరాజు ఇల్లింద్రపర్రు లాకులు

మండలంలో ప్రధానమైన సమస్యగా ఉన్న సోమరాజు ఇల్లింద్రపర్రు(ఎస్‌ఐ పర్రు) నీటి పారుదల శాఖకు చెందిన పంట నీటి కాలువ ప్రధాన లాకులు అధ్వాన స్థితికి చేరుకుంది. సుమారు పదేళ్లుగా ఈ లాకుల పరిస్థితి దయనీయంగా ఉండగా, పాతలాకులకు ఎగువ కొత్తగా లాకుల నిర్మాణం ఆదిలోనే ఆగిపోయింది. ఇక్కడ అప్పుడు వేసిన ఇనుప రాడ్లు తుప్పు పట్టి, ఆ శాఖ నిర్లక్ష్యంకు నిదర్శనంగా కనిపిస్తోంది. లాకుల తలుపులు దెబ్బతిని, పూర్తిగా తుప్పు చేరి, బిగుసుకు పోయి ఉండగా, ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గుర్రపు డెక్క విస్తరించి పోయి నీటి ప్రవాహానికి అడ్డం పడుతోంది. వేలాది ఎకరాల పొలాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే ఈ లాకుల్ని యుద్ధ ప్రతిపదికన బాగుచేసి, ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దయనీయంగా మార్టేరు లాకులు

ఎక్కడో మారుమూలన ఉన్న ఎస్‌ఐ పర్రు లాకుల పరిస్థితిలాగే నరసాపురం -ప్రక్కిలంక రోడ్డులో విజ్జేశ్వరం-నరసాపురం పంట కాలువ మార్గంలో నిర్మించిన మార్టేరు లాకులు రిపేరు సమస్యలలో ఉంది. ఈ లాకులకు సైతం మరమ్మత్తులు చేపట్టి, ఆయకట్టు పొలాలకు సక్రమంగా నీరు అందేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మురికిమయంలో గోస్తనీ నది మురుగు డ్రెయిన్

పెనుమంట్ర-అత్తిలి ప్రధాన రహదారిలో ప్రవహించే గోస్తనీ నది మురుగు కాల్వ ఆక్రమణలు పూడికతో భరించలేని దుర్గంధం వెదజల్లుతూ పరిసర ప్రాంత వాసుల్ని ఇబ్బంది పెడుతోంది. మొత్తం ఈ డ్రెయిను పొడుగునా తూటు, పెద్ద పెద్ద గడ్డి మొక్కలు పెరిగిపోయి, నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సేకరించిన చెత్తను ఇందులోకే డంప్ చేయడం కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. భారీ


నీటిజాడ కానరాని గోస్తానీ నది

వర్షాలు పడినా, గోదావరికి వరదలు వచ్చినా ఆనుకొని ఉన్న పొలాల్లోని పంటలు మునిగిపోయి, తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


తుప్పు పట్టిన మార్టేరు లాకులు

రక్షిత మంచినీటికి కటకట

మండలంలోని గ్రామాల్లో ఇంచుమించు అన్ని గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఉన్నా, మంచినీటికి కటకట తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఎక్కడికక్కడ రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, వాటికి నీరు చేరవేసే పైపు లైన్స్ తుప్పు పట్టడం వల్ల ప్రయివేటు నీటి వ్యాపార సంస్థలను ప్రజలు ఆశ్రయించక తప్పడం లేదు. గోదావరి ప్రాంతాన ఉన్నా, మంచినీళ్లు కొనుక్కొని తాగే పరిస్థితి దురదృష్టకరమని, ఈ దుస్థితి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన మురుగు కాల్వలను నిర్మించాలని, ఉన్నవాటిని సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను తీర్చడంతో పాటు, మండల కేంద్రం, మార్టేరులో కాని ఒక అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇలా మార్టేరులో ఏర్పాటు చేయడం వల్ల ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల్లోని అన్ని గ్రామాలకు అగ్నిమాపక కేంద్రం అందుబాటులో ఉన్నట్టు అవుతుందని వారు తెలిపారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామాల ప్రజలు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి విద్యార్థి వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యండగండి కో-ఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవికుమార్ అన్నారు. సోమవారం యండగండి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకువాడ రవికుమార్ మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీల ద్వారా చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని అన్నారు. వేసవిలో చిన్నారులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదువుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేగేశ్న సత్యరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.


నరసాపురం: నీతికథలు చదువుతున్న విద్యార్థులు

నరసాపురం: ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల సందర్భంగా సోమవారం పిల్లలకు నీతి కథలు చెప్పడం, చదివించడం జరిగిందని లైబ్రేరియన్ కెజెఎస్ఎస్ఎల్.కుమారి తెలిపారు. అనంతరం యోగా క్లాసులు, మెడిటేషన్‌లో శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించబడ్డాయన్నారు. ఈ శిక్షణా తరగతులకు స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాస్, హెచ్ఎం.నాగలక్ష్మి, సుధీర్ మోహన్, సూర్యం బాబు, ప్రవీణ్, జీవన్, జి.శ్రీనివాస్ రీసోర్స్ పర్సన్స్‌గా పాల్గొని పిల్లలకు శిక్షణ ఇచ్చారు. జూన్ 7వ తేదీ వరకూ ఈ శిక్షణా తరగతులు జరుగుతాయని, పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి తెలిపారు.

పంట, మురుగు కాలువలను ప్రక్షాళన చేయాలి

మాజీ ఎంఎల్ఎ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

గత ఐదేళ్లుగా పంట కాలువల్లో పూడికతీతపనులు చేయలేదని, వాటిని వెంటనే ప్రక్షాళన చేసి రైతులను, ప్రజలను ఆదుకోవాలని ఉండి మాజీ ఎంఎల్ఎ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు కోరారు. మండలంలోని కలవపూడి వద్ద కిక్కిసతో నిండిన అన్నయ్యకోడు పంటకాలువ, జువ్వలపాలెం వద్ద తూడు, గుర్రపుడెక్కతో నిండిన వెంకయ్య వయ్యేరు కాలువతోపాటు పలు పంట కాలువలను ఆయన స్థానిక సర్పంచులు, నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంఎల్‌ఎగా పనిచేసిన పదేళ్ల పంట, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చేశానని గుర్తు చేశారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం, అధికారులు కాలువల వైపు దృష్టి పెట్టకపోవడంతో అవి పూర్తిగా పూడుకుపోయి శివారు ప్రాంతానికి తాగునీరు అందని పరిస్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని, కాలువల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కి స్వయంగా వెళ్లి నియోజకవర్గంలోని పంట, మురుగు కాలువల పరిస్థితిని వివరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట కలవపూడి సర్పంచి గేదెల జాన్, మాజీ సర్పంచి ముదుండి మణిబాబు, నంబూరి త్రిమూర్తులు రాజు, వక్కపట్ల వంశీకృష్ణ, దిలీప్ పాల్గొన్నారు.


కాలువను పరిశీలిస్తున్న శివరామరాజు



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

అధిక ఉష్ణోగ్రతల సమయంలో ఉపాధి కూలీలు ఎంతో కష్టపడి పనులు చేశారని, వారికి రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అన్నారు. ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, సుపర్నెంట్‌కు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయలేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూడే మొజెస్, బురాబత్తుల వెంకటరావు, ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

21 నుంచి ఎస్‌విజి పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి మార్టేరు ఎస్‌విజి హైస్కూల్‌లో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఇంటర్మీడియట్(కో ఎడ్యుకేషన్) కోర్సులలో అడ్మిషన్లు ఈనెల 21 నుంచి ప్రారంభం అవుతున్నాయని సంబంధిత విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఫీజుల భారం లేని ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, విద్యా మెటీరియల్ అందించడంతో పాటు, మధ్యాహ్న భోజన సదుపాయం, ఇతర ప్రభుత్వ రాయితీలు, వసతులు అందుతాయని అన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ కాలేజీలో చేరేందుకు 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని, సోమవారం నుంచి హైస్కూల్ ఆఫీసులో సంప్రదించి, ఇంటర్‌లో అడ్మిషన్ పొందవచ్చునని వారు తెలిపారు. మార్టేరు పరిసర ప్రాంతాల్లోని పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఉచిత విద్యను పొందాలని కోరారు.

నరసింహమూర్తి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు మాజీ సర్పంచి, విద్యావేత్త, ఆదర్శమూర్తి, వల్లూరి నరసింహమూర్తి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. వల్లూరు గ్రామంలో సోమవారం వల్లూరి నరసింహమూర్తి 108వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ముందుగా గుడాల వెంకటేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇందుకూరి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ వల్లూరు గ్రామానికి మొట్టమొదటి సర్పంచిగా, 19 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ప్రజలకు సేవలు అందించి, అందరి మన్ననలు పొందారని కొనియాడారు. వల్లూరు గ్రామానికి మొట్టమొదటిగా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, పశువుల ఆసుపత్రి, గ్రామం చుట్టూ పార్కు తీసుకువచ్చారని, ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుమిల్లి సుబ్బారావు, కట్టుంగ సూర్యనారాయణ, కాపవరపు ఇశ్రాయేలు, దేవల రమేష్, బొర్రా ధర్మారావు, గుడాల వెంకటేశ్వరరావు, ఏడిద వెంకటరాజు పాల్గొన్నారు.

కుల వ్యవస్థను వ్యతిరేకించిన వ్యక్తి.. సుందరయ్య

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చిన్ననాటి నుంచి అభ్యుదయ భావాలతో సుందరరామిరెడ్డిగా ఉన్న పేరును రెడ్డిని తొలగించి సుందరయ్యగా పిలుపించుకుని, కుల వివక్షను వ్యతిరేకిస్తూ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసిన వ్యక్తి సుందరయ్య అని సిపిఎం మండల నాయకులు రేవు రామకృష్ణ తెలిపారు. తోకతిప్ప గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో సిపిఎం స్థూపం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రేవు రామకృష్ణ మాట్లాడుతూ గాంధీ పిలుపు మేరకు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారని, కమ్యూనిస్టు పార్టీలో చేరి కేంద్ర కమిటీ సభ్యుడిగా పార్టీని మరింత విస్తరించడానికి కృషి చేశారన్నారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషిస్తూ నిజాం ప్రభువులకు వ్యతిరేకంగా విశాలమైన ప్రజల మద్దతు ద్వారా నాలుగువేల గ్రామాల్లో 10 లక్షల ఎకరాలకు పైగా భూ పంపిణీ చేశారన్నారు. పార్లమెంటు ఎంపీగా, అసెంబ్లీలో ఎంఎల్‌ఎగా కొనసాగుతూ ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. పార్లమెంటుకు, అసెంబ్లీకి సైకిల్ మీద వెళ్తూ అతి సామాన్య వ్యక్తిగా నిలిచిపోయారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం సిపిఎం శాఖ ఆధ్వర్యంలో తాకతిప్ప సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరావు, తిరుమణి నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఆక్వాకు డీజిల్ అందజేయాలి

పాలకొల్లు: ఆక్వాకు డీజిల్ ఇబ్బంది పెట్టవద్దని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోలు, డీజిల్ కొట్టాలనే ప్రభుత్వ నిబంధనలతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆక్వా చెరువులకు అవసరమైన డీజిల్‌ను కొట్టకపోవడంతో రైతుల ఇబ్బందులపై స్పందించిన ఆయన సోమవారం పాలకొల్లులోని పెట్రోల్ బంకుకు వెళ్లి ఆరా తీశారు. జిల్లా కలెక్టర్, పోలీసు శాఖల నుంచి వచ్చిన ఆదేశాలతోనే డీజిల్ వాహనదారులకు మాత్రమే కొడుతున్నామని బంకు యజమానులు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్, నరసాపురం డిఎస్‌పిలతో ఎంఎల్ఎ మాట్లాడారు. అనంతరం విలేకరులతో మా ట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం మార్పుతో ఆక్వా చెరువులకు ఆక్సిజన్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మరోపక్క తరచూ విద్యుత్ కోతలతో జనరేటర్ వినియోగించుకోవాల్సి వస్తుందన్నారు. జనరేటర్లకు అవసరమైన డీజిల్, పెట్రోల్ బంకుల్లో కొట్టకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంఎల్ఎ తెలిపారు. అసలే ఆక్వా రంగం ఇబ్బందుల్లో ఉందని, ఇటువంటి తరుణంలో కొత్త నిబంధనలు మరింత పాతాళానికి నెట్టుతాయన్నారు. ఆక్వా చెరువులకు అవసరమైన డీజిల్‌ను పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జిల్లా కలెక్టర్, డిఎస్‌పిను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆక్వా రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా చూడాలని ఎంఎల్ఎ కోరారు.

ఘనంగా ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలను ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ స్టేట్ కన్వీనర్ చవ్వాకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రెల శ్రీధర్, యెగ్గిన నాగబాబు పాల్గొన్నారు. అభిమానుల మధ్య ఏర్పాటుచేసిన కేక్‌ని కట్ చేసి వేడుకలను గొర్రెల శ్రీధర్, యెగ్గిన నాగబాబు ప్రారంభించారు. అనంతరం గతంలో ఎన్‌టిఆర్ సినిమాకు బ్యానర్ కడుతూ ప్రమాదశాత్తు చనిపోయిన ఎన్‌టిఆర్ అభిమాని పండు కుటుంబ సభ్యులకు ఎన్‌టిఆర్ పంపించిన రూ.2 లక్షలను అందించారు. ముగ్గురు పేద విద్యార్థులకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో థియేటర్ నిర్వాహకులు, జూనియర్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎలక్షన్ కౌంటింగ్ రోజున డీజేలకు, ఊరేగింపులకు, బాణసంచాలకు అనుమతులు లేదని తెలిపారు. ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాళ్లలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల గ్రామదేవతలైన మహంకాళ్లమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన సోమవారం నిర్వహించారు. దాతలు, యాత్రికులు, గ్రామస్తుల, జాతర కమిటీ సభ్యుల ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి యాత్రికులు పెద్ద ఎత్తున అన్న సమారాధనకు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, మాజీ సర్పంచి బండారు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

కాళ్ల: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళ్లకూరు గ్రామంలో 600 ఏళ్ల పైబడిన చరిత్ర కలిగిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి వారికి మల్లెల పుష్పములతో విశేషార్చన నిర్వహించారు. వివిధ మేళతాళములతో శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అభినయ నాట్య అకాడమీ కె.జ్యోతి శిష్య బృందంచే కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు.